
ఈ వారం తెలుగు పుస్తకం

# 'శతపత్ర' సమీక్షణం

■ డా॥వాడ్రేవు వీరలక్ష్మీదేవి




Title: Satapatramu
Subject: BIOGRAPHY
Year of Publication: 2004
Price: USD $ 2.31

శ్రీ గడియారం రామకృష్ణ శర్మగారు రాసిన 'శతపత్రము' అన్న పుస్తకం సాక్షాత్తూ ఆయన ఆత్మకథే. ఈ పుస్తకాన్ని 'సుపథ' అనే ప్రచురణల సంస్థ ప్రచురించింది. ప్రచురణ కర్తలు ముందుమాటలో సమాజానికీ, సాహిత్యానికీ కూడా వికాసం కలిగించే రచనల ప్రచురణ తమ అభిలాష అనీ, తాము ప్రచురిస్తోన్న ఈ ఆత్మకథా రూపమయిన పుస్తకం సమాజ చరిత్రకు ప్రతిరూపమని చెప్తూ రచయిత గురించి రెండు మాటలు చెప్పారు. శ్రీ గడియారం రామకృష్ణశర్మగారు వర్తమాన కాలంలో మూడు తరాల ప్రతినిధి, మేధావి, కవి, పండితుడు, ఉత్తమ సంస్కృతి మూర్తీభవించిన వారు. ఇంతేకాక గతాగతాలకు వారధి అన్నవి వేలు విలువ చేసే ఆ రెండు మాటలూనూ.

ఒక వ్యక్తి బహుముఖంగా వ్యక్తం కావడమూ, ఆ వ్యక్తత ఒక వికాస పరిమాణాన్ని పొంది, తన చుట్టూ ఉన్న సమాజానికి ఆ వికాసపు సుగంధాలను అందించి, తన తోటి మానవ సమూహాలను అభివృద్ధి వేపు నడపడం అన్న అంశమంతటినీ 'శతపత్రము' అన్న ఒక్కపదం సూచిస్తోంది.

మనిషి అన్ని వేపులకీ సమానంగా విస్తరించిన వృక్షంలా అభివృద్ధి చెందాలంటారు. ఇది ఎంతో మంది ప్రఖ్యాతుల విషయంలోనే కనిపించదు. అరుదుగా కొద్దిమంది విషయంలో మాత్రమే రుజువవుతూ ఉంటుంది. అలాంటి అరుదయిన వ్యక్తిగా రామకృష్ణశర్మగారి ఈ ఆత్మకథకు ఈ *శతపత్ర*మన్న పేరు అనువుగా సరిపోయింది.

ఈ పుస్తకానికి అక్కిరాజు రమాపతిరావుగారు ఒక విశిష్టమయిన ముందుమాట రాసారు. '*అరుదయిన ఆర్జవం*' అని దానికి పేరు పెట్టారు. *ఆర్జవం* అంటే ఋజుత్వం. అదే లేకపోతే 'ఆత్మకథ' అన్న దానికి ప్రామాణికతే లేదు. ఋజుత్వం కలిగిన మనిషి తన గురించి తాను నిశ్శంకగా గుణదోషాలు చెప్పకోగలుతాడు. అది లేని నాడు ఆత్మకథ వల్ల లోకానికి ఏ ఉపయోగమూ లేదు. అయితే ఋజుత్వం ఉన్నంత మాత్రాన ఆత్మకథ రాసుకోవలసిన ఆవశ్యకత లేదు.సామాజిక సంఘర్షణల యాథార్థతలకు ప్రత్యక్ష ప్రమాణాలుగా ఏవయితే నిలవగలవో అటువంటి జీవితానుభవాలు కలవారే ఆత్మథా రచనకు పాత్రులవగలుగుతారు.

ఈ పుస్తకం ఆద్యంతమూ చదివిన తర్వాత మనకు ఆ ఋజుత్వమేమిటో ఎంతో స్పష్టంగా తడుతుంది. తాను ఉన్నవాడు ఉన్నట్లు, తన ప్రవర్తనను ఉన్నది ఉన్నట్లు ఒప్పకోగలగడం, లోక పరత్వం లేక పోవడమే గాక

లోకభీతి కూడా లేని స్థిర చిత్తత అన్న లక్షణాలు రామకృష్ణశర్మగారి ఈ ఆత్మకథను అత్యంత ఆవశ్యకమయిన పుస్తకంగా నిలబెడుతున్నాయి.

ఈ పుస్తకంలోని ప్రకరణాలు రెండు భాగాలుగా విభజించబడ్డాయి. మొదటి భాగమంతా ఆయన జీవితం ఏ విధంగా నడిచిందీ వేటి వేటితో అది అనుసంధించబడిందీ, ఏ ఏ సంఘటనలు, ఏ వ్యక్తులు, ఏ ఉద్యమాలు, వాటి విజయాలు, వైఫల్యాలు ఆ జీవితంలోకి వచ్చి తనను ప్రభావితం చేసాయో ఆ అధ్యాయాలతో నిండి ఉంది. ఈ భాగాన్ని ఆయన కాలక్రమాన్ని బట్టి రాసానన్నారు. ఇక రెండవ భాగం ఆయన తన పూనికతో ప్రయత్నంతో నిర్వహించిన కార్యక్రమాలు , చేసిన పనులు, వ్రాసిన గ్రంథాలు మొదలయిన విశేషాధికమైన విశేషాలతో నిండి ఉంటుంది. దీన్ని ఆయన విషయానుక్రమంగా సాగింది అన్నారు. సూక్ష్మంగా చూస్తే మొదటి భాగమంతా జీవితం ఆయన నడిపిన తీరును, రెండవ భాగమంతా జీవితాన్ని ఆయన చెవులు పట్టి లాక్కుని వచ్చిన విధానాన్ని తెలియజేస్తాయి. జీవితం తనకు అందించిన మార్గాన్ని గురించి మొదటి భాగం చెప్తే ఆ విధంగా అందిన జీవితాన్ని, ఆ పగ్గాలను తన చేతిలోకి తీసుకుని దాన్ని సమాజ నిర్మాణంలో భాగంగా, సమాజాభివృద్ధికి పనికి వచ్చేలా తనను మలచుకోవడంలా రెండవ భాగం చెప్పినట్టుంటుంది. గడియారం వంశీయులు పూర్వం 'ఘటికా నిర్ధారక' అనే పదవిలో పని చేసిన వాళ్ళు అయి ఉంటారట. 'ఘటీ' అంటే గంటలు. ఆరం అంటే చెప్పే యంత్రం. అదే గడియారం అయి వుంటుంది, 'నెమళ్ళదిన్నె' అగ్రహారంలో వీరి పూర్వీకులు ఉండేవారట. అక్కడ నుంచి ఒక కుటుంబం 'మలుగుండ్ల పల్లె' అగ్రహారం చేరుకుంది. క్రమంగా ఆ గ్రామం క్షీణించడంతో ఆ కుటుంబంలోని తరువాతి తరాలు ఆ రాయలసీమ ప్రాంతంలోనే ఉన్న 'బాబాసాహెబ్ పల్లె' అనే పల్లెటూరును చేరుకున్నాయి. దిగుడుబావి, ఓబుళదేవ చెరువు, వాగు, పంటపొలాలు, రామాలయం, అన్ని కులాల ప్రజలతో ఉన్న అందమయిన ఊరు అది.

వ్యవసాయం, పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబంలో పుట్టారు శర్మగారు. ఆ కుటుంబం పండిత కుటుంబమయినా సరే బంధు వర్గంతోనే కాక ఊరిప్రజలందరితోనూ ఎంతో కలివిడిగా కలిసి మెలసి ఉండే కుటుంబం.

వారి తండ్రిగారి పెళ్ళి చిత్రంగా జరిగింది. సుబ్బమ్మ అనే వధువుకి నిశ్చయించిన వరుడు పెండ్లినాటికి కూడా తిరిగి రాలేక పోయాడు. ఆ విధంగా పెళ్ళి ఆగిపోయింది. ఆ సమయంలో పెద్దల కోరిక మీద తండ్రి జ్వాలాపతి గారికి ఆ వధువుతో వివాహమయింది. ఆ విధంగా సుబ్బమ్మగారు శర్మగారి మాతృమూర్తి అయ్యారు.

ఆ దంపతులకు కలిగిన పన్నెండు మంది సంతానం లోనూ నలుగురు మిగలగా రెండవ వాడే శర్మగారు.

రామకృష్ణశర్మగారు కాళయుక్తి నామ సంవత్సరంలో అంటే 6-3-1919 వ తేదీన జన్మించారు. అవిభక్త కుటుంబంలో ఉండే ప్రేమలు ఆయనకు ఆ పసినాళ్ళలోనే తెలిసాయి. రోజుల తేడా మాత్రమే ఉన్న పెద్దనాన్నగారి అబ్బాయిని అన్నయ్యా అనే పిలిచేవాడిననీ, చివరిదాకా అలాగే నడిచిందనీ, పిలుపుల వల్ల ఒక సంస్కారం, గౌరవ వాత్సల్యాలు చెదిరి పోకండా ఉంటాయని అంటారు. ఇది ఆలోచించాల్సిన మాట.

రామాలయం వీధి బడిలో చదువు చెప్పే మాష్టారు కోమటి చలమయ్యగారు. సాయంత్రం పూట పాత ఉత్తరాలు చదవడం అలవాటు చేయించేవారని రాస్తారు. ఒకప్పుడు ఇటువంటి అంశం పాఠ్యప్రణాళికలో భాగంగా ఉండేదని వినడం ఎంతో ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

ఆ రోజుల్లోని మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే పురోహిత బ్రాహ్మణ కుటుంబానికి పొరుగూరిలో ఉన్న రెడ్ల కుటుంబంతో వైరం. వైరమంటే దాదపు పదేళ్ళపాటు యుద్ధం. ఇందుకోసం వీరి ఇంట్లో అయిదారుగురు పహిల్వాన్లు, రెండు కుక్కలు సిద్ధంగా ఉండేవట. ఇవి కాక వేట కొడవళ్ళు, బల్లేలు, గండ్రగొడ్డళ్ళు కూడా. వాటితో పాటు కేసులు. కోర్టులు. వీటికే ఆస్తి అంతా హరించుకు పోయింది. ఎదుటి పార్టీ వాళ్ళు కూడా అంతా పోగొట్టుకున్నారు. ఇక వీరి కుటుంబం ఆ ఊళ్ళో ఉండలేక, 'కదిరి'కి మకాం మార్చేసి, మళ్ళీ అక్కడ పేరు ప్రతిష్ఠలు, ధనమూ సంపాదించగలిగారు.

ఈ బాల్య జీవిత ప్రభావం శర్మగారి మీద చాలానే ఉందనిపిస్తుంది. తరువాతి కాలంలో ఆయన చేసిన పోరాటాలకు శక్తి అక్కడనుంచే వచ్చి ఉండాలి.

అయిదవ తరగతి దాకా చదువు పూర్తిచేసేసరికి మళ్ళీ కాపురం తాడిపత్రి దగ్గర ఉన్న 'శింగవరానికి' మారింది. ఖర్చులు పెరిగి, అప్పులూ పెరిగి బీదరికం వరించింది. ఆ పరిస్థితుల్లో శర్మగారి చదువు సాగలేదు. బావ కడప తీసికెళ్ళి చదివించబోయినా ఆ ఉర్దూ మీడియం చదువు ఆయనకు సరిపడలేదు.

అటు పౌరోహిత్యం మీద ఆసక్తి లేక పోవడం వల్ల, సాహిత్యపఠనం మీది ఆసక్తి వల్ల ప్రాచీన కావ్యాలు చదువుకుని, నెమ్మదిగా పద్యరచన సాగిస్తూ పల్లెలోని అన్ని కులాల వారితోనూ వరుసలు కలిపి మాట్లాడుతూ ఉండే జీవన విధానం అలవడింది. అలాంటి రోజుల్లోనే వారి ఇంటికి అతిథిగా వచ్చిన గాడిచర్ల హరిసర్వోత్తమ రావుగారి దర్శనం అయింది. అయితే ఆయన నిరాడంబర స్వభావంలోని గొప్పదనం అప్పుడు తెలియ లేదంటారు శర్మగారు.

ఇలాంటి వాతావరణం, ప్రభావాల మధ్య నుంచి అదృష్టవశాత్తూ శర్మగారికి వేలూరి శివరామశాస్త్రి గారి వద్ద శిష్యరికం లభించింది. అలా అనేకంటే ఆ బీద పరిస్థితుల్లో ఆయన అనుగ్రహం లభించిందనాలి. శివరామ శాస్త్రిగారిది పశ్చిమగోదావరి జిల్లాలోని 'సురవరం' అనే గ్రామం. ఆయన రామకృష్ణశర్మగారిని తన ఇంట్లోనే ఉంచుకుని పుత్ర వాత్సల్యం చూపుతూ చదువు చెప్పేరు.

శివరామశాస్త్రిగారు మహావ్యక్తి. గొప్ప పండితుడే కాక గొప్ప మానవతావాది కూడా. కుల తారతమ్యాలను ఏవగించుకునేవాడు. ధనవంతుడయి కూడా అతి నిరాడంబర జీవనం సాగించ గలవాడు. మనుచరిత్ర గ్రంథంలో ఉన్న శూద్రుడు వేదం వినకూడదన్న శ్లోకం చదివి ఛీత్కారంతో ఆ పుస్తకాన్ని విసిరి కొట్టినవాడు. అయితే అటువంటి వాటిని ప్రక్షిప్తాలుగా అర్థం చేసుకోగలిగినవాడు. అంతేకాక బ్రాహ్మణులలో ఉండే మూఢాచారాలను పోగొట్టడానికి సొంతంగా శ్లోకాలే నిర్మించి ప్రాచీనులే ఇలా చెప్పేరని నమ్మించగల దిట్ట కూడాను-అని శర్మగారు తమ గురువు గారి గురించి రాస్తారు.

ఆ గురువుగారి వల్ల ఎందరో మహానుభావుల పరిచయమైందట. వారివల్లనే విజయవాడ రైల్వే స్టేషన్‌లో కనిపించిన ఆజానుబాహు విగ్రహాన్ని గిడుగు రామ్మూర్తి పంతులు గారని పరిచయం చేయగా పాదాభి వందనం చేసే భాగ్యం లభించిందంటారు. గిడుగు రామ్మూర్తిగారి అసాధారణ తత్వాన్ని అప్పటికే గ్రహించ గలిగేరు. చివరిగా వారి గురువు గారి గురించి ఇలా రాస్తారు.

"మా గురుదేవుల వ్యక్తిత్వం చాలా గొప్పది, విశిష్టమైనది. ఆగర్భ శ్రీమంతులయినా నిరాడంబరులు, దార్శనిక పండితులయినా నిరహంకారులు. మాన్యులను, సామాన్యులను సమానంగా చూసే ఉదాత్త వర్తనులు" అంటూ.

ఆయన వ్యక్తిత్వ ప్రభావం శర్మగారి మీద ఎంతగా పడిందో ఆయన తరువాతి జీవితమంతా చెప్తుంది.

కానీ శర్మగారి విద్యాభ్యాసం మధ్యలోనే ఆగిపోవలసి వచ్చింది. వారి అక్క తాలూకు కోర్టు వ్యవహారం పరిష్కరించే నిమిత్తం శర్మగారు శివరామశాస్త్రిగారిని వదలక తప్పలేదు. అక్క కోర్టు పనులు చూడ్డానికి అలంపురం వచ్చేనాటికి శర్మగారికి నిండా ఇరవయి ఏళ్ళు లేవు. బావ చనిపోగా పిల్లలు లేని అక్కకు బావగారి ఆస్తి రానివ్వకుండా దాయాదులు అడ్డుపడ్డారు. ఆ వ్యవహారం పరిష్కరించడంలో రామకృష్ణశర్మగారు చూపిన తెలివి, సామర్థ్యమే కాక దానికోసం ఆయన ఏర్పరుచుకున్న, పెంచుకున్న సాంఘిక సంబంధాలు, వ్యవహారాన్ని నిర్వహించిన తీరు ఇవన్నీ కూడా ఆయనలోని కార్యదక్షుడిని మనకు చూపెడతాయి. అలంపూర్‌కి జిల్లా కేంద్రం రాయచూరు. అందువల్ల కోర్టు వ్యవహారాల కోసం రాయచూర్ వెళ్ళవలసి వచ్చేది. ఏ ఊరు వెళ్ళినా కార్య దక్షుడితోపాటు, ఆయనలోని చారిత్రక పరిశోధకుడు కూడా మేలుకొనేవాడు.

రాయచూర్‌ను ఆయన ఒక ఊరుగా చూడలేదు. గోనగన్నారెడ్డి కాలంలో అక్కడ ఇక మహాదుర్గం నిర్మించబడిందనీ, 14వ శతాబ్దంలో బహమనీ సుల్తానుల వల్ల కోట స్వరూపం నాశనమయి దేవాలయాలు మశీదులుగా మారాయని చెప్తూ మన నాయకులకు దూరదృష్టి లేకపోవడం వల్ల ఆ జిల్లా కర్ణాటకకు పోయిందని విచారిస్తాడు ఆయనలోని చరిత్రకారుడు.

ఈ కోర్టు కేసులు, పై కోర్టులకు అప్పీలుకు వెళ్ళడం వల్ల, వాటికోసం తిరగడంలో శర్మగారి సామాజిక పరిజ్ఞానం మరింతగా పెరిగి సాంఘిక సంబంధాలు మరింత బలమయ్యాయి. చాలా పెద్ద ఎత్తున జరిగిన వాద ప్రతి వాదాలలో ఈ కేసును గెలిపించడమే శర్మగారి జీవితంలోని కార్యనిర్వహణా సామర్థ్యపు మొదటి ఫలంగా గుర్తించవచ్చు.

## -2-

ఒక వ్యవహారం చక్కబెట్టే సందర్భంలో ఒక కార్యకర్తగా బయలుదేరిన వ్యక్తి మార్గంలో చేయగలిగినన్ని పనులు చక్క బెట్టగలగడం అతని బహుముఖ సామర్థ్యానికి లేదా బహుముఖ తృష్ణకు గుర్తు. శర్మగారిలోని అటువంటి బహుముఖమయిన తృష్ణ ప్రతీ సందర్భంలోనూ కనిపిస్తుంది. అలంపురంలో ఉన్న రోజుల్లో ఆయన ఒక గొప్ప మిత్రుణ్ణి సంపాదించుకోగలిగారు. జీవితమంతా శర్మగారిలోని సాహిత్యపిపాస తీరడానికి కారణమైన వ్యక్తి ఆయన. వారి పేరు దుంపల రామిరెడ్డి. శర్మగారికి అంత బీదరికంలోనూ రామిరెడ్డిగారి వల్ల ఎన్నో గ్రంథాలు కొని చదివే అవకాశం లభించింది. వారి గ్రంథాలయమంతా శర్మగారిదే అయిపోయింది. ఆయన గురించి శర్మగారు ఇలా అంటారు...

"వారు నన్నొక రచయితగా లోకానికి పరిచయం చేసారు. అలంపురం క్షేత్రాన్ని గురించి నాతో గ్రంథాలు రాయించి ఆయనే ముద్రించారు. వారినీ, భగవంతుడినీ తప్ప నేను ఇతరులను ఎన్నడూ స్తుతించలేదు."

ఒక వ్యక్తి అభివృద్ధి అతనికి వచ్చిన అవకాశాలతోబాటు అతను కల్పించుకోగల అవకాశాలను బట్టి కూడా ఉంటుందనే మాట శర్మగారిని చదువుతూ ఉంటే రుజువవుతూ ఉంటుంది. కానీ వ్యక్తి అభివృద్ధిని సమాజాభివృద్ధికి దోహదం చెయ్యడం మాత్రం శర్మగారి వంటి కొద్ది మంది దగ్గర మాత్రమే చూడగలం.

ఎదిరించడం, పోరాడడం అన్నది జీవితమంతటా ఒక జీవిత విధానంగా సాగుతూ వచ్చిన రామకృష్ణ శర్మగారిలో మొదటి సారిగా ఆ శక్తులు జాగృతమయిన సందర్భం ఒకటి ఉంది. ఆ సంఘటన నా జీవితానికి

పెద్ద మలుపయిందని ఆయన కూడా అన్నారు.ఒకసారి అలంపురానికి వచ్చిన ఒక నాటకం కంపెనీ వేసే హరిశ్చంద్ర నాటకం చూస్తుండగా తాగివచ్చిన పోలీసులు నటులను అల్లరి పెట్టబోయారు. ప్రేక్షకులు చూస్తున్నారు కానీ ఆ దౌర్జన్యాన్ని ఎవవరూ ఆపలేకపోయారు. అప్పుడు శర్మగారు మరికొందరు యువకులను కూడగట్టుకొని ఆ పోలీసు జులుం ఎదిరించి తిరగబడడంతో పోలీసులు భయపడ్డారు. ఈ సంఘటన ఆయనను ఆలోచింపజేసింది. ఇటువంటి అధికార జులుమును నిరసించడానికి ఏదో ఒక సాంస్కృతిక రూపమయిన సంఘం అవసరమని తోచింది. వెంటనే ఒక నాటక మండలి స్థాపించి ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టారు. ఈ కారణంగా చాలామంది అధికారుల పరిచయాలు లభించాయి.

తన బతుకు తెరువు కోసం ఏదో ఒక పని చేస్తూనే లోకాన్ని ముఖ్యంగా సమకాలీన సమాజాన్ని గమనించే స్పృహ ఆయను ఒక బాల వితంతువునే వివాహం చేసుకునేలాగ చైతన్య పరచింది. ఆయన ప్రత్యేకత అంతా కమల అనే ఆ బాల వితంతువును వివాహం చేసుకోవడం ఒక ఆదర్శంగా కాక సాధారణ విషయంగా భావించడం దగ్గరే ఉంది.

సంఘం మాత్రం వితంతు పునర్వివాహం కాదు కదా, అసలు వితంతువు గాజులు, పువ్వులు, బొట్టు మొదలయినవన్నీ తీసెయ్యాలన్న దగ్గరే ఉంది. లేకపోతే మహాపచారమనే మూఢ నమ్మకం దగ్గర ఉంది. స్మృతుల నుంచి శ్లోకాలను తీసి చూపిస్తూ ఆనాటి సంఘంతో శర్మగారు పండిత పోరాటం చేసి గెలవడం విశేషం.

ఇదంతా శర్మగారి జీవితంలో ఆరంభదశ మాత్రమే. సాహిత్య రంగం వేపు, సంఘసంస్కరణ వేపు ఆయన వేసిన మొదటి అడుగులు ఇవి. కార్యకర్తగా అక్కగారి వ్యాజ్యం మీద పనిచెయ్యడం ఆయనలోని శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని పైకి తీసిన అంశం. పోలీసు జులుం మీద తిరుగుబాటుతో పాటు నాటకమండలి స్థాపనతో అధికార దౌర్జన్యం మీద తిరుగుబాటు చెయ్యడానికి దారి తెలిసింది. ఇలా శర్మగారి జీవితం ఈయన చెయ్యగల, చెయ్యవలసిన పనుల వేపు దిశా నిర్దేశం చేసి పెట్టేసింది.

## -3-

పందొమ్మిది వందల నలభై నాటికి దేశంలోనూ, రాష్ట్రంలోనూ స్వాతంత్ర్య పోరాటం ఒక వైపు నడుస్తుండగా తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజలు నిజాం సంస్థానంలో ఉండి నిజాం నవాబు పాలనలోని నిరంకుశత్వాన్ని, దౌర్జన్యాన్ని అనుభవిస్తున్నారు. ఆ సంస్థానంలోని అధికారుల ఆగడాలు కూడా అలాగే ఉన్నాయి. వాటిని తప్పని సరిగా ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.

భారత సంస్థానాల్లో పెద్దదయిన నిజాం సంస్థానంలో 16 జిల్లాలు ఉన్నాయి. ఇందులో 8 జిల్లాలు తెలంగాణ, 5 జిల్లాలు మరాఠీ, 3 జిల్లాలు కర్ణాటక. ముగ్గురికీ ఎవరి మాతృభాష వారికి ఉన్నా అనుసంధాన భాష ఉర్దూయే. స్కూళ్ళలో ఉర్దూ మీడియం. దీని వల్ల ప్రజలు నలిగిపోయారు. అయితే మహారాష్ట్ర, కర్ణాటక ప్రజలు కొంత చొరవ చేసి మాతృభాషకే ప్రాధాన్యమిచ్చుకొని తమ సంస్కృతిని ప్రచారం చేసుకున్నారు. కానీ తెలంగాణాకు అంత చొరవ లేదు. దాని కారణంగా 1921లో హైదరాబాదులో జరిగిన సంఘసంస్కరణ సభలలో తెలుగువారికి చాలా అవమానం జరిగింది. అప్పటికి కొందరు పెద్దలు మేల్కొని ఆంధ్ర సంఘాన్ని స్థాపించి, ముఖ్యయిన తీర్మానాలు చేసారు. పల్లెలలో గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు, తెలుగు ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు స్థాపించారు. సురవరం ప్రతాపరెడ్డిగారి 'గోల్కొండ' పత్రిక స్థాపన ప్రజలలో చైతన్యాన్ని

కలిగించింది. ఈ ఆంధ్రజన సంఘం 1930ల నాటికి ఆంధ్ర మహాసభగా మారింది.

దుంపల రామిరెడ్డిగారి సూచన మీద 1940లో అలంపురం తాలూకాలో ఆంధ్ర మహాసభ తరఫున కమిటీని ఏర్పాటు చేసి గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు ప్రారంభించి పని మొదలు పెట్టడంతో శర్మగారి రాజకీయ జీవితం ఆరంభమయింది. ఆంధ్రమహాసభ ప్రధాన లక్ష్యం సంస్థానాన్ని రద్దు చేసి ఒక రాష్ట్రం ఏర్పడేలా చేయడం. సంస్థానం నవాబ్ మీర్ ఉస్మానలీఖాన్ నిరంకుశ ప్రభువు. సంస్థానంలో జాగీర్లు, గద్వాల వంటి చిన్న చిన్న సంస్థానాలూ ఉన్నా వాటి స్థితి మరీ ఘోరం.

ఈ నేపథ్యంలో శర్మగారు స్థాపించిన తాలూకా కమిటీ రకరకాల వర్గాల పెద్దలను కలుపుకుని పనిచేయడం ప్రారంభించింది. ఆయన ఒక రాజకీయ కార్యకర్తగానే కాక పండితుడిగా ప్రజలకు ధర్మాన్ని, మతాన్ని గురించి వివరించడం, ధర్మసందేహాలు తీర్చడం, పురాణాలు చదివి వినిపించడం చెయ్యడం వల్ల సంస్కృతి ప్రచారం కూడా జరిగింది. అలంపూర్‌లో శ్రీరామకృష్ణ గ్రంథాలయం స్థాపించారు. దాన్ని తర్వాత ముప్ఫయి ఏళ్ళపాటు సంరక్షించారు.

వేలూరి శివరామశాస్త్రిగారి శిష్యరికం వల్ల కులమతాల పట్టింపు పోయిందని అందువల్ల అన్ని కులాల వాళ్ళను ఇంట్లో తెచ్చుకునే వాడినని రాస్తారు. ఖద్దరు ధరించడంతో పాటు ఖాదీ ఉత్పత్తి విక్రయ కేంద్రాన్ని కూడా సభ్యులు ప్రారంభించారు.

నెమ్మదిగా ఈ గ్రామాలలో రాజకీయ చైతన్యం ఆరంభమయింది. ఈ విధంగా ఆ ప్రాంతమంతటా వ్యాపించిన రాజకీయ చైతన్యానికి శర్మగారే సూత్రధారి.

ఇదికాక మరో వైపు సంఘసంస్కరణ కార్యక్రమాలు ముమ్మరంగా సాగించారు. పలుచోట్ల వితంతు పునర్వివాహాలను దగ్గరుండి జరిపించారు. బలవంతపు మత మార్పిడులను ఆపుచేసారు. ఈ విషయంలో శర్మగారికీ మిగిలిన సంఘసంస్కర్తలకూ ఒక ప్రధానమైన భేదం ఉంది. దురాచారాలను శాస్త్ర ప్రమాణాలు చూపి ఖండించగలగడం. దానికి అవసరమయిన శాస్త్ర పరిజ్ఞానాన్నంతా ఆయన సంపాదించారు. వినయాశ్రమం వారు వేసిన ఋగ్వేద, యజుర్వేద, సామవేదాల అర్థ తాత్పర్యాల సంపుటాలను తెప్పించి దగ్గర ఉంచుకున్నారు. వాని శ్రద్ధగా అధ్యయనం చేసారు. వేదార్థ చంద్రిక అనే పత్రికలోని కొన్ని సంచికలలో వేసిన ధర్మశాస్త్రాల అర్థ తాత్పర్యాల సహాయంతో ఆ శాస్త్రాలను పరిశీలించారు. పాత స్మృతులలోని ప్రక్షిప్త భాగాలను ఖండించి ఆధునిక కాలానుగుణమయిన ప్రాయశ్చిత్తాలను ఎన్నింటినో ఆ గ్రంథాల ద్వారా గ్రహించారు. వీటి ఆధారంతో ప్రజలలో ఉన్న మూఢాచారాలను, మూఢవిశ్వాసాలను పోగొట్టే కృషి చేస్తూ స్వయంగా కొన్నింటిని తానే ఆచరించి చూపగలగడం ఆయన వ్యక్తిత్వంలోని గొప్ప అంశం. అవసరమయితే పీఠాధిపతులతో కూడా చర్చలు జరిపి ఒప్పించిన సందర్భాలున్నాయి. అదీ ఆయన శక్తి సంపన్నత.

జనశక్తి గురించి శర్మగారికి బాగా తెలుసు. ఆయన ఆత్మ కథ నిండా ఎందరి ప్రసక్తి ఉంటుందో. ఏ మంచి పని చెయ్యాలన్నా ఒక్కడి వల్ల కాదని, జనాన్ని కూడ గట్టుకోవాలని ఆయనకు ఎంత బాగా తెలుసో, కూడ గట్టుకునే విద్య కూడా అంత బాగా తెలుసు. తనకు సహకరించే ప్రతివ్యక్తికీ ప్రత్యేకతనిచ్చి చూడడమే ఆ విద్య. అలంపురం ఆంధ్ర మహాసభ కార్యక్రమాలలో ఎన్నో సంవత్సరాల పాటు తనకు తోడ్పడిన కార్యకర్తలందరినీ పేరు పేరునా తన ఆత్మకథలో స్మరించడమే దీనికి గుర్తు. పుస్తకమంతటా కూడా ఈ నామస్మరణ అడుగడుక్కీ

కనిపిస్తూనే ఉంటుంది. తనను జీవితం పొడుగునా కలుస్తూ వచ్చిన వారినందరినీ ఆయన స్మృతిపథంలో నిలుపుకుని పుస్తకం పొడుగునా స్మరించారు.

1940 నుంచి తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో జరిగిన ఉద్యమ చరిత్రే రామకృష్ణగారి జీవిత చరిత్ర అనిపిస్తుంది. అప్పటి ఎన్నో రాజకీయ విషయాలు ఈ ఆత్మకథలో వివరించబడ్డాయి. నైజాం సంస్థానంలో జరిగిన విముక్తి పోరాటాలు తక్కిన ప్రాంతాల వారికి తెలియనివి ఈ పుస్తకంలో ఉన్నాయని అక్కిరాజు రమాకాంతం గారు రాస్తారు. 1948 లో నిజాం సంస్థానంలో జరిగిన పోరాటానికి ప్రామాణికమయిన వివరాలు ఈ పుస్తకంలోనే ఉన్నాయని కూడా అంటారు. ఆ రోజుల్లో తెలుగు వారయిన కొందరు పెద్ద మనుషులు, కవులు, జాతీయోద్యమ నేతలని కీర్తించబడిన వాళ్ళు నిజాంను సమర్థించి, ప్రశంసించడం గురించి ఎంతో వివరంగా రాసారు. నిజాం పరిపాలన నుండి విముక్తి దొరికిన మర్నాడే వారి వేషాలు మార్చి రాజకీయాలలో అధికార పదవులకు ఎగబాకడం గురించి కూడా వదిలి పెట్టలేదు.

1942-46 మధ్యలో నాలుగు ఆంధ్ర మహాసభలు జరిగేయి. అన్నింటిలోనూ శర్మగారు చురుగ్గా పాల్గొని వాటి బాగోగులనన్నింటిని తన కథలో వివరంగా రికార్డు చేసారు. 1946లో స్టేట్ కాంగ్రెస్ మీద నిషేధం తొలగడంతో తిరిగి మూడు భాషాసభలూ స్టేట్ కాంగ్రెస్‌లో విలీనం అయ్యేయి. అప్పటివరకూ అంటే 1943 నుంచి శర్మగారి కాలమూ, సేవా కొత్తగా ఏర్పడిన ఆంధ్రసారస్వత పరిషత్తుకు అంకితమయ్యాయి. తిరిగి దాని తాలూకా శాఖ కూడా అలంపురంలో ఏర్పడడం దానికి కార్యదర్శిగా శర్మగారు పని మొదలు పెట్టడం జరిగింది. తిరిగి గ్రంథాలయాల స్థాపన, పుస్తక ప్రచురణలు, జాతిని జాగృత పరిచే కవులు, నాయకులతో సభలను ఏర్పాటు చెయ్యడం వంటి కార్యక్రమాలే జీవితంగా ఆ కాలమంతా నడిచింది.

పరిషత్తు నాల్గవ వార్షికోత్సవం జరిగిన తర్వాత భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించడింది. కానీ నైజాం సంస్థానం మాత్రం స్వతంత్రంగానే ఉంది. కాశీం రజ్వీ నాయకత్వంలో రజాకార్ ఉద్యమం విజృంభించింది. పూర్తి అరాచకం రాజ్యమేలుతోంది. అలాంటి సమయంలో శర్మగారు పూర్తిగా రాజకీయాలలోకి దిగి నిజాం విముక్తి పోరాటం సాగించడమంతా ఈ పున్తకంలో ఎంతో వివరంగా ఉంది.

నిజాం నవాబు స్టేట్ కాంగ్రెస్ మీద నిషేధాన్ని ఎత్తివేయడంలోని కుతంత్రం ' అనల్ మలిక్' నినాదంతో విజృంభించిన ముసల్మీన్‌ను అణచివేయడమే. ఇది నవాబు ఎత్తుగడ. అది అదనుగా స్టేట్ కాంగ్రెస్ తిరిగి తీవ్రంగా కార్యకలాపాలు ప్రారంభించింది. ఈ విముక్తి పోరాటమంతటినీ శర్మగారు ఎంతో ప్రామాణికంగా రాసారు. ఒక దశలో స్టేట్ కాంగ్రెస్ ఉద్యమ తీవ్రత తగ్గి, రజాకర్ల దురాగతాలు ఎక్కువయినా, ఈ తాలుకా కమిటీ నిర్వహించే కార్యక్రమాలు మానలేదు. గ్రామాలలోని ప్రజలను ఉత్తేజితులను చెయ్యడమే పని.

అలంపూర్ వాసస్థులు టి.చంద్రశేఖరరెడ్డి గారి సాహసంతో ఆ ప్రాంతంలోని కొన్ని గ్రామాలను స్వాధీనం చేసుకుని 1948 సెప్టెంబర్ 6వ తేదీన నిజాం సంస్థానం నుండి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. అలంపూర్ పట్టణంలోని నిజాం సైన్యం ప్రతిఘటన చెయ్యలేక పోయింది. రజాకార్ల దురాగతాలు కాంగ్రెస్ పాత్రికేయుణ్ణి చంపడం దాకా పోవడంతో నెహ్రూ దృష్టి మారి పటేల్‌కు నిజాం సంస్థానం ముట్టడికి ఆజ్ఞ ఇవ్వబడింది.

1942 సెప్టెంబరు 12 వతేదీ మహమ్మదాలీ జిన్నా మరణించగానే 13 వ తేదీన అన్ని వేపుల నుంచీ సైన్యాలు నిజాంనుముట్టడించాయి. నవాబు గత్యంతరం లేక లొంగిపోయాడు. 19 వ తేదీకి సంస్థానం ఇండియన్

యూనియన్‌లో కలసిపోయింది. అయితే సెప్టెంబరు 6వ తేదీనే శర్మగారు తన కథలో చంద్రశేఖరరెడ్డిగారు ప్రకటించిన స్వాతంత్ర్యం గురించి రాసారు. ఈ మొత్తం నిజాం విముక్తి పోరాటం శర్మగారి ఆత్మకథలో ప్రధాన భాగం.

అయితే తర్వాత జరిగిన విషయాలు ఆయనను చాలా బాధ పెట్టేయి. నిజాం లొంగుబాటు తర్వాత ప్రభుత్వం ఆయనను కర్నూలు మిలటరీ ప్రభుత్వ కార్యాలయంలో సహాయకారిగా నియమించింది. రజాకార్ల వల్ల దోచుకోబడి, ఇళ్ళు వదిలి పారిపోయిన ప్రజలందరికి తిరిగి రక్షణ, పునరావాస ప్రయత్నాలు చేసారు.మిలటరీ ప్రభుత్వ పాలనలోనే గద్వాల్ సంస్థానం రద్దు అవడం వలన గద్వాల్ తాలూకాలోనే అలంపూర్‌ను కూడా చేర్చే ప్రయాత్నాలు జరిగాయి. అది తెలిసిన శర్మగారు గట్టి ప్రయత్నాలు చేసి 48 గ్రామాలున్న అలంపూర్ తాలూకా లోనే మరికొన్ని గ్రామాలు చేరడం వల్ల కలిగే సదుపాయం చూపించి వంద గ్రామాలతో అలంపూర్ తాలూకా ఏర్పడేలా చెయ్యగలిగారు. రెవెన్యూ మంత్రి వి.ఆర్.శేషాద్రి గారికి నచ్చ చెప్పి మ్యాపు చూపించి ఒప్పించి చేసిన గొప్ప పని ఇది.

ఆ తర్వాత జరిగిన జనరల్ ఎలక్షన్లమీద శర్మగారు ఎంతో సాహసోపేతమయిన విమర్శలు చేసారు. ఎవరెవరికి ఎలా టికెట్టు ఇచ్చారో చాలా ఘాటుగా విమర్శించారు.

అలంపురం తాలూకా ఏర్పడ్డ తర్వాత ఆయన దృష్టి పూర్తిగా దాని అభివృద్ధి మీదకే వెళ్ళింది. మద్రాసు గవర్నమెంటు తమ నీటి సమస్య తీర్చుకోవడానికి తలపెట్టిన సంగమేశ్వరం ప్రాజెక్టు మీద పోరాడ వలసి వచ్చింది. ఆ ప్రాజెక్టు గనక వస్తే మద్రాసుతో పాటు మరికొన్ని ఆంధ్ర రాష్ట్రాలకు నీటి ఇబ్బంది తగ్గుతుందని కామరాజ్ నాడార్ జవహర్‌లాల్ నెహ్రూను ఒప్పించారు. కానీ అదే జరిగితే అలంపురం దేవాలయ శిఖరం నీళ్ళ మీద తేలుతూ ఉంటుంది. వందల సంవత్సరాల చారిత్రక పట్టణం నేల మట్టమయిపోతుంది. కాని ఆ ప్రాజెక్టు ను ఆపుచేయించడం అసాధ్యమయిన పని. ఎందరి ద్వారా చెప్పించాలని చూసినా నెహ్రూ గారి పట్టుదలను సడలించలేమన్నారు. చివరకు ఒక్క ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి వల్ల అవుతుందని తెలిసింది. ఆయనను అలంపురం రప్పించి సమస్యను ఆయనకు వివరించి ఆయనకీ నష్టం బోధపడేలా చెయ్యడానికి శర్మగారు భగీరథ ప్రయత్నం చేసారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షికోత్సవం అలంపురంలో ఏర్పాటు చేసి దానికి రాధాకృష్ణన్ గారి ఆహ్వానించి వారికి పరిస్థితి వివరించి, నెహ్రూగారికి నచ్చచెప్పేలా ఒప్పించగలిగారు. ఈ ప్రయత్నం వెనక శర్మగారి పట్టుదల ఒక ప్రాచీన పుణ్యక్షేత్రాన్ని కాపాడాలనే తపన ఆత్మకథ ఎంతో వివరంగా చెప్తుంది. ఎందరు అధికారులను అక్కడికి రప్పంచడం, ఈ లోగా ఆ ఊరిలో హైస్కూల్‌ను, పురావస్తు మ్యూజియంను ఏర్పాటు చేయడం చివరకు మహాసభల నిర్వహణ - ఎంతటి అసాధ్యుడు ఈ మనిషి అనిపిస్తుంది.

ఒక పని తర్వాత మరొకటి. అలుపెరగని పథికుడు. విశాలాంధ్ర ఉద్యమం పిలిచింది మళ్ళీ ఆయనను. విశాలాంధ్ర మహాసభల్లో ఉత్తేజ పూరితంగా పద్యాలు చదివిన శర్మగారు హైదరాబాద్ రాష్ట్రం ఏర్పడకుండా విశాలాంధ్రలోనే విలీనం అయ్యే పోరాటంలో కూడా భాగస్వామి అయ్యారు.

ఆ సందర్భంలో ఆయన ఒక ఆశ్చర్యకరమయిన విషయాన్ని రాసారు. తుంగభద్రానదికి ఆనకట్ట కట్టినప్పడు ఎడమ వైపు ఒక కాలువ తవ్వేరు. 1944 లో తవ్విన ఆ కాలువ పేరు రాజోలిబండ కాలువ. కానీ కుడి వేపు

డాం పది అడుగలు తక్కువగా కట్టినందువల్ల రావలసిన నీరు రాయచూరు దగ్గరే ఆగిపోయింది. దీన్ని ఆనాడే శర్మగారు ప్రభుత్వం దృష్టికి తెచ్చి ఎలా సరిచేసుకోవచ్చో సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదని, అదే జరిగి ఉంటే ఈనాటి రాజోలుబండ కాలువ సమస్యలు ఉండేవి కావని రాస్తారు.

విశాలాంధ్ర ఉద్యమం తర్వాత శర్మగారు రాజకీయాలకు, హైదరాబాద్ జీవితానికీ కూడా స్వస్తి చెప్పి మకాం అలంపురం మార్చి జీవితమంతా అలంపురం అభివృద్ధి కార్యక్రమాలు మీదే కేంద్రీకరించారు.

-4-

గడియారం వారి వంశం వెయ్యేళ్ళుగా వర్ధిల్లుతోందని 11 వశతాబ్ది తెలుగు శాసనం ఆధారంగా శర్మగారే చెప్పేరు. అలాగే వారు నివసించిన అలంపురం యొక్క ప్రాచీనతను కూడా శాసనాధారాలతో ప్రామాణికంగా నిరూపించారు. స్కంద పురాణం సనత్కుమార సంహితలో ఈ క్షేత్ర ప్రశస్తి విపులంగా ఉంది. తుంగభద్రానదీ తీరంలో వెలసిన మహాస్థలం. మౌర్య, శాతవాహన, ఇక్ష్వాకు, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కల్యాణి చాళుక్య, కాలచార్య, తెలుగుచోడ, కాకతీయ, విజయనగర రాజ్యాలకు లోబడిన ప్రాంతంగా శాసనాలు చెప్తున్నాయి. ఈ విధంగా ఇంత చారిత్రక ప్రాధాన్యం కలిగినదని తెలుస్తోంది. ఇదంతా శర్మగారి పరిశోధన. ఈ క్షేత్రం మీద చేసిన పరశోధనతో శర్మగారు చాలా గ్రంథాలు రాసారు.

అలంపుర దేవాలయానికి ధర్మకర్తల సంఘం అధ్యక్షుడిగా 1954 జనవరిలో బాధ్యత తీసుకున్నారు. అప్పటికి దేవాలయ ధనం నిల్వ 3680/- రూపాయలయితే 1984 లో ఆలయ బాధ్యతలు వదులుకునే నాటికి 3 లక్షల 68 వేల రూపాయల బాంకు బాలెన్స్ అప్పజెప్పారు. ఇది కాక ఆ ఆలయం పేరు మీద ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసారు.

అటు తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శిగా 1958 లో ప్రారంభించి, అటు తర్వాత ఉపాధ్యక్షునిగా 84 నుంచి ఈ గ్రంథ రచన చేసే వరకూ పనిచేస్తునే ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కూడా శర్మగారి సేవలను, తెలివిని వినియోగించుకుంది. అకాడెమీ చేపట్టిన పనులలో క్రియాపద నిఘంటు పరిశీలన ఒకటి. అందులో శర్మగారు నిర్ధారణ కమిటీ సభ్యులుగా పనిచేసారు. మెకంజీ కైఫీయతులను ఎత్తి రాయించే పని కూడా నిర్వహించారు. అకాడమీ వ్రాయించ తలపెట్టిన దక్షిణ భారత సాహిత్య సంపుటంలో కన్నడ సాహిత్య చరిత్ర భాగాన్ని రాసి పెట్టారు. మంచన కేయూర బాహు చరిత్రకు, కొఱవి గోపరాజు *సింహాసన ద్వాత్రింశిక*కు పరిష్కరణ చేసి విపుల పీఠికలు రాసారు. ఈ విధంగా సాహిత్య అకాడెమీ వారిని ఉపయోగించుకుంది.

ఎక్కడ ప్రజలకు హితం కలిగించే కార్యక్రమాలు జరుగుతాయో అక్కడ శర్మగారు ఉండి తీరేవారు. అధికారుల అహంకారాన్ని ఎదిరించడానికయినా, మాల మాదిగల దేవాలయ ప్రవేశం చేయించడానికయినా, విద్యా వేత్తలమనుకునేవారి అసంపూర్ణ జ్ఞానాన్ని ఎత్తి చూపడానికయినా శర్మగారు జంకలేదు.

ప్రభుత్వం రైతుల పక్షాన, ప్రజల పక్షాన లేకుండా వారిపై దౌర్జన్యానికి దిగితే జనాన్ని కూడగట్టుకుని వారిపై పోరాటం సాగించడం ఆయన జీవనంలో భాగమయిపోయింది. ఏ చదువులూ అక్కర్లేకుండా ప్రజావాహినితో కలసి ఇలాంటి ప్రజాహితాలు చెయ్యడం నిత్యకృత్యమే అనిపించేటన్ని అంశాలు వారి ఆత్మకథలో ఉన్నాయి.

ఆధ్యాత్మిక రంగంలోకి కూడా ఆయన హేతుబద్ధమయిన ఆరోగ్యమయిన దృష్టితోటే ప్రవేశించారు. మైసూరు వెళ్ళినప్పుడు గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమం చూసి, ఆ ఆడంబరాలు చూసి ఏవగించుకున్నారు.

శర్మగారికి అత్యంత ప్రీతి పాత్రమయిన అంశం చరిత్ర పరిశోధన. శాసన పరిశోధన కూడా ఆయనకు ఎంతో ఆసక్తికరమయిన అంశమే. ఇండియన్ "ఎపిగ్రఫీ ఆఫ్ సౌత్ ఇండియన్ స్క్రిప్ట్స్" అనే గ్రంథం చదవడానికి తనఇరవై ఏడవ ఏట ఇంగ్లీషు నేర్చుకున్నారట. వాస్తు పరిశోధనలో కూడా ఎంతో ఆసక్తి ఉంది. అలంపురం క్షేత్రంలోని వాస్తు మీద కూడా పరిశోధన చేసారు.

వారి విశిష్ట వ్యక్తిత్వాన్ని గురించి ఇకటి రెండు ఉదాహరణలు ఇవ్వాలి. జర్మన్ దేశీయురాలయిన డా॥స్టెల్లా కామరిష్ అనే ఆమె అలంపూర్ దేవాలయాల వాస్తుశైలిని బట్టి అవి 9వ శతాబ్ది తరువాత వి కావచ్చని రాసిందట. ఆమె వాదనను ఖండిస్తూ స్వర్గబ్రహ్మాలయం ద్వారపాలకుని మీది వినయాదిత్యుని శాసనం చూపిస్తే ఆమె తన పొరపాటును అంగీకరిస్తూ థాంక్స్ చెప్పిందని రాసారు. ఇది రాయడం విశేషం కాదు.

మరొకసారి లండన్ మ్యూజియం క్యూరేటర్ డా॥ డగ్లస్ బ్యారటో వచ్చినప్పుడు ఆయనకు ఆలయం చూపిస్తూ శర్మగారు బ్రహ్మేశ్వరాలయం మీది ప్రాకారం పెద్దదిగా ఉండేదని తురకల చే పాడు చెయ్యబడిందని చెప్పారట. దానికి ఆయన ఆ ప్రాకారం పరిశీలించి ఇది పాడుకాలేదని, ఇదే ప్రాకార బంధమని, నిర్మాణ విధానం చూపించి ఒప్పించగలిగాడట. అతని మేధాశక్తికి ఆశ్చర్య పోయానని రాస్తారు. ఇది రాయడం విశేషం.

మరొక ఆంగ్ల చరిత్ర పరిశోధకుడికి ఆలయం చూపిస్తే యమునానది వాహనమయిన తాబేలు శిల్పాన్ని చూపంచి " సీ దిస్ టార్టాయిస్" అని శర్మగారు అనగానే ఆ ఆంగ్లేయుడు వెంటనే "దిసీజ్ ఎ టిపికల్ కూర్మ' అన్నాడట. వెంటనే తాను సిగ్గుపడిపోయానని చెప్పి అతని భాషా పాటవాన్ని, ఆసక్తిని ఎంతో మెచ్చుకున్నారు.

సాహిత్య రచన గురించి కూడా పూర్వ కవుల భావాలను గ్రహించి నా మాటలలో చెప్పేవాడినని రాస్తారు.ఇది రచనారంభ దశలో సంగతి. కాని ఎందరో కవులు పైకి చెప్పకోని మాట ఇది. ఆ విధంగా పూర్వ కవుల భావాల ఆధారంగా తాను రాసిన కావ్యాన్ని జనమంచి శేషాద్రిగారు హేళన చెయ్యడం వల్లనే తనకు వేలూరి శివరామ శాస్త్రిగారి సన్నిధికి చేరే భాగ్యం లభించిందంటారు. శర్మగారు తమ గ్రంథ రచనల గురించి,సాహిత్య సేవ గురించి,దేశయాత్ర గురించి ఎంతో వివరంగా ఈ పుస్తకంలో పొందుపరిచారు.

శర్మగారు బాల వితంతువయిన కమలను వివాహం చేసుకుని ఆమెతో ఆయన సుదీర్ఘమయిన దాంపత్య జీవితాన్ని కొనసాగించారు. ఈ పుస్తకాన్ని ఆమెకే అంకితం చేస్తూ కొన్ని మాటలు రాసారు.

నన్ను ఋజుమార్గంలో నడిపిన ఆత్మేశ్వరి, నా పురుషాహంకారాన్ని ఎన్నడూ ప్రశ్నించక మనసారా క్షమించిన కరుణామయి అని చెపూ్త నా జీవిత సర్వస్వాన్నీ సమర్పిస్తున్నానన్నారు. పై మాటలతో పురుషాహంకారం అన్నది క్షమించవలసినది అనడంలో అది తప్పనే ఒప్పకోగలగడం ఆయనలోని వైశాల్యాన్ని సూచిస్తోంది.

విప్ర శబ్దానికి విశేషమయిన ప్రజ్ఞ కలవాడని అర్థం. ఆ అర్థంలో శర్మగారు నిజమయిన విప్రుడు. కాని వారి సంతానంతో పాటు అన్ని కులాల వారిని - ఆ ఇంటికి కోడళ్ళుగా అల్లుళ్ళుగా వస్తే - సాదరంగా ఆహ్వానించారు.

ఈ పుస్తకానికి విశిష్టమయిన ముందుమాట రాసిన అక్కిరాజు రమాపతిరావుగారు పుస్తకంలోని కీలకమయిన అంశాల మీద సమగ్రమైన వ్యాఖ్యానం రాసారు. వీరేశలింగం గారి ఆత్మకథతో పోలికలు చూపించారు. అలాగే తిరుమల రామచంద్రగారికీ శర్మగారికీ కూడా ఎన్నో పోలికలు చూపించారు.

"స్వీయ చరిత్ర ఎవరు పడితే వారు రాసుకోరు కదా!

తాము జీవించిన సమాజంలో, కాలంలో తాము ఆశించిన మార్పుల కోసం తపన పడి అందుకోసం కృషిచేసినవారూ, తమ వంతు కర్తవ్యపాలనలో పాల్గొన్నవారూ హృదయ, మేధా వికాసం కలవాళ్ళూ, కళలలో సాహిత్యంలో సమాజ సువ్యవస్థాకాంక్షులు, ప్రతిభా సంపన్నులు, త్యాగ జీవనులు మాత్రమే రాస్తారు" అని అక్కిరాజు రమాపతిరావుగారు ముందు మాటలో అంటారు. ఆ విధంగా చూసినట్లయితే శర్మగారు తమ ఆత్మకథ రాసుకోవడం ఎంతో సబబయిన విషయం.

తన గురించి ఒక మాట ఎక్కువగా గాని, ఒక మాట తక్కువగా గాని చెప్పకోకుండా ఉండగలగడం ఎంతో కష్టం. ఆ విధమయిన సంయమం కూడా స్వీయచరిత్ర  రాసుకునే వారికి అవసరం. అటువంటి వ్యక్తిగా గడియారం రామకృష్ణ శర్మగారి "శతపత్రము" అభినందనీయం.

back to book of the week home page

ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ మానికొండ సత్యనారాయణ (న్యూజెర్సీ-యు.ఎస్.ఎ) గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.